12న ఉచిత దర్శనం

ఇంద్రకీలాద్రి: ఈ నెల 12న దసరా సందర్భంగా భవానీ దీక్షాధారులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున ఐదు క్యూలైన్లలో ఉచితంగా భక్తులకు దర్శనం కల్పించాలని నిర్ణయించినట్లు మంత్రి రామనారాయణరెడ్డి ప్రకటించారు.


ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఉత్సవాల ఏడో రోజు గురువారం అమ్మవారు శ్రీదుర్గాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. వేకువన 4 గంటల నుంచి రాత్రి 11 వరకు లక్ష మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. బుధవారం మూలా నక్షత్రం సందర్భంగా క్యూలైన్లు కిక్కిరిసి రాత్రి వరకూ కొనసాగాయి. వచ్చిన భక్తులందరికీ సరస్వతీదేవి దర్శనం కల్పించేందుకు త్వరితగతిన క్యూలైన్లను ముందుకెళ్లేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. మూలానక్షత్రంతో పోలిస్తే గురువారం రద్దీ కొద్దిగా తగ్గింది.

దుర్గతి నాశిని సద్గతి దాయిని

నేడు మహిషాసుర మర్దినిదేవిగా దర్శనం...

ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలలో ఎనిమిదో రోజు శుక్రవారం అమ్మవారు మహిషాసురమర్దినిదేవి రూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

దర్శన సమయాలు: వేకువన 4 నుంచి రాత్రి 11 గంటల వరకు



శ్రీ దుర్గాదేవిగా జగన్మాత



దర్శనానికి తరలివచ్చిన భక్తులు

కృష్ణమ్మ మదిలో సేవారతన్



పారిశ్రామిక మేరునగ ధీరుడు.. రతన్ టాటా. ప్రపంచంలోనే అత్యంత ప్రభావశీలురైన పారిశ్రామిక వేత్త. నిరాడంబరంగా ఎదిగిన టాటా.. అపూర్వ సేవాప్రస్థానంతో కోట్లాది హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. ముఖ్యంగా ఉమ్మడి కృష్ణా జిల్లాలో 264 గ్రామాల్లో టాటా ట్రస్టు ద్వారా సేవలు అందించి ఔదార్యం చాటారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని ఆచరణలో చాటుతూ.. పేదింట ప్రాణదీపాలు వెలిగించారు. నారీమణులను నైపుణ్యబాటలో నడిపి ఆర్థిక స్థిరత్వంతో ఎదిగేలా అండగా నిలిచారు. అక్షర వెలుగులు పంచేలా విద్యాలయాలను తీర్చిదిద్దారు. పల్లెసీమలకు సుజలాలు దరి చేర్చి.. బృహత్తర బాధ్యతను నిర్వర్తించారు. సేద్యానికి వెన్నుగా.. స్వచ్ఛతకు దన్నుగా నిలిచారు. అఖండ భారతావనికి కన్నీటిని మిగిల్చి... దిగ్గజం దివికేగిన వేళ.. కృష్ణమ్మ మదిలో కొలువుదీరిన సేవా"రతన్" సంకల్ప పథంపై

"ఈనాడు" ప్రత్యేక కథనం... 6లో..

ఎన్టీఆర్‌లో దండిగా.. కృష్ణాలో అరకొరగా



ఈనాడు - అమరావతి: ప్రైవేటు మద్యం దుకాణాలకు ఎన్టీఆర్ జిల్లాలో భారీగా స్పందన కనిపిస్తోంది. మరో రోజు గడువు ఉండగానే గురువారం రాత్రి ఎనిమిది గంటల వరకు 4,836 దరఖాస్తులు వచ్చాయి. శుక్రవారం రాత్రి 7 గంటల వరకు దరఖాస్తుల సమర్పణకు గడువు ఉంది. దీంతో చివరి రోజు ఈ సంఖ్య మరింత పెరిగే వీలుందని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంతో సరిహద్దు ఉన్న మండలాలకు ఎక్కువ ఆదరణ కనిపిస్తోంది. ఆ ప్రాంత దుకాణాలకు ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్నారు. గురువారం కూడా ఇదే పరిస్థితి కనిపించింది.

సరిహద్దు దుకాణాలపై ఆసక్తి

జిల్లాలో తెలంగాణకు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లోని షాపులకు దరఖాస్తుల వరద కొనసాగుతోంది. వత్సవాయి మండలంలో నోటిఫై చేసిన రెండు షాపులు బుధవారం రాత్రికే వంద దాటాయి. గురువారం 96వ దుకాణానికి 117, 97వ దుకాణానికి 109 దరఖాస్తులు వచ్చాయి. పెనుగంచిప్రోలు మండలంలోని ఐదు షాపులకు కూడా ఇదే స్పందన కనిపిస్తోంది. ఇదే మండలంలో 81వ దుకాణానికి 98, 84వ షాపునకు 74, 83వ దుకాణానికి 71 మంది దాఖలు చేశారు. కొండపల్లి పట్టణంలో నోటిఫై చేసిన రెండు షాపులకు స్పందన వచ్చింది. 62, 68 షాపుల దరఖాస్తులు దాఖలయ్యాయి. ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లోని దుకాణాలకు 50 పైగా వచ్చాయి. విజయవాడ నగరంలో ఎక్సైజ్ శాఖ నోటిఫై చేసిన 39 దుకాణాలకు కూడా పెరుగుతున్నాయి. ఒక్కో షాపునకు సగటున 30 పైగా వచ్చాయి.

కృష్ణాలో సిండికేట్లతో గండి

కృష్ణా జిల్లాలో చాలా ప్రాంతాల్లో సిండికేట్ల ప్రభావం ఎక్కువగా ఉంది. దీని కారణంగా దరఖాస్తులు తక్కువ సంఖ్యలో వస్తున్నాయి. వెరసి ప్రభుత్వ ఖజానాకు జమకావాల్సిన దరఖాస్తు రుసుము భారీగా గండిపడుతోంది. ప్రజాప్రతినిధులు, వారి అనుచరుల బెదిరింపులతో ఈ పరిస్థితి నెలకొంది. సిండికేట్‌గా ఏర్పడి వారికే దరఖాస్తు చేస్తున్నారు. గుడివాడ పట్టణంలో ఏడు షాపులు నోటిఫై చేస్తే కాగా.. వీటికి నామమాత్రంగా వచ్చాయి. గుడివాడ మండలంలోని వాటికీ ఇదే రీతిలో పడ్డాయి. గన్నవరం నియోజకవర్గంలోని బాపులపాడు, ఉంగుటూరు మండలాల్లోని చాలా దుకాణాలకు అరకొరగానే దరఖాస్తులు వచ్చాయి. ఉయ్యూరు పట్టణం, మండలం, పెనమలూరు మండలాలలోని దుకాణాలకు ఇదే పరిస్థితి. గురువారం రాత్రికి కృష్ణా జిల్లాలో 1,987 దరఖాస్తులు మాత్రమే దాఖలయ్యాయి.

రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయ విధానాలు భేష్

❖ నీతి ఆయోగ్ బృందం ప్రశంస



మాట్లాడుతున్న రైతు సాధికారసంస్థ ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు విజయకుమార్, ప్రొ.డా.రమేష్‌చంద్, బాబు.ఎ, ఉన్నతాధికారులు

ఆత్కూరు(గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం రైతు సాధికార సంస్థ ద్వారా ఏపీ సీఎన్ఎఫ్(ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం) పేరుతో అమలు చేస్తున్న వ్యవసాయ విధానాలు ఆదర్శనీయమని నీతి ఆయోగ్ గౌరవ సభ్యుడు ప్రొ. డాక్టర్ రమేష్‌చంద్ ప్రశంసించారు. రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయ విధానాలపై సంపూర్ణ అవగాహనకు ప్రొ.డాక్టర్ రమేష్‌చంద్ నేతృత్వంలో 8 మంది సభ్యుల బృందం గురువారం ఏలూరు, కృష్ణా జిల్లాల్లో పర్యటించింది. తొలుత కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణ భారత్ ట్రస్ట్ ఆవరణలో రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ టి.విజయకుమార్.. బృంద సభ్యులకు ఏపీసీఎన్ఎఫ్ గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రకృతి వ్యవసాయ ఆవశ్యకత, సార్వత్రిక సూత్రాలు, అమలుతీరు, లక్ష్యాలు తదితర అంశాలను వివరించారు. 2016లో 40 వేల మంది రైతులతో మొదలైన ప్రకృతి వ్యవసాయం.. ప్రస్తుతం 10 లక్షల రైతులకు చేరుకుందన్నారు. ప్రభుత్వంతో పాటు అజీమ్ ప్రేమ్‌జీ, కే ఇంపాక్ట్, కేఎఫ్ డబ్ల్యూ తదితర సంస్థల మద్దతుతో కార్యక్రమాన్ని ముందుకు నడిపిస్తున్నట్లు చెప్పారు. 2018లో 11 మందితో మొదలైన పీఎండీఎస్(ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్) ప్రస్తుతం వేల ఎకరాలకు విస్తరించిందన్నారు.

గ్రీన్ కవర్.. ఆదాయ ఉత్పత్తిపై.. వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ కమిషనర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ.. 365 రోజుల గ్రీన్ కవర్, ఆదాయ ఉత్పత్తి, కార్బన్ అంశాలను, దిగుబడి వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ సురేష్‌కుమార్ చౌదరి, డాక్టర్ రాజ్బీర్ సింగ్‌లతో కలిసి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మింగ్ సిస్టమ్స్ రిసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ సునీల్‌కుమార్ రైతులతో సంభాషించారు. రైతులకు ఆసక్తిని ప్రదర్శిస్తూ సైన్స్, ప్రకృతి వ్యవసాయ ఏకీకరణ, తెగుళ్ల నివారణ చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఆహార భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై నీతిఆయోగ్ ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ నీలంపటేల్, ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్.శారదజయలక్ష్మిదేవి, నీతి ఆయోగ్ వ్యవసాయ నిపుణులు పరమేల్ ఉపవర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యానవన, మత్స్య శాఖ ముఖ్య కార్యదర్శి ఏ.బాబు, రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎస్.డిల్లీరావు, రాష్ట్ర ఉద్యానవన శాఖ డైరెక్టర్ ఎస్.శ్రీనివాసరావు, ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ పార్థసారథి, జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి పద్మావతి, రైతు సాధికార సంస్థ ముఖ్య కార్య నిర్వహణాధికారి బి.రామారావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శామ్యూల్ ఆనంద్ పాల్గొన్నారు.

కనకదుర్గాదేవిగా కొండలమ్మ



అలంకారంలో అమ్మవారు



ఊరేగింపు

వేమవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: వేమవరం కొండలమ్మ దేవస్థానంలో గురువారం అమ్మవారు కనకదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రుల్లో భాగంగా ముఖ్యమైన దుర్గాష్టమి సందర్భంగా ఉదయం సహస్రనామ కుంకుమార్చన, దుర్గాసూక్తమూలమంత్ర హవనములు, శ్రీదుర్గా హోమం నిర్వహించారు. మధ్యాహ్నం గుడివాడ విజయదుర్గ మహిళాకోలాట సమాజంచే కోలాటం నిర్వహించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించామని, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పాల్గొని ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభించారని ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. జానపద కళా ప్రదర్శనలు, గరగన్నృత్యం, సంప్రదాయ డప్పువాయిద్యాలతో వేమవరం, వడ్లమన్నాడు, కౌతవరం గ్రామాల్లో అర్ధరాత్రి వరకూ అమ్మవారిని ఊరేగించారు. సీఐ సోమేశ్వరరావు, ఎస్ఐ సత్యనారాయణ, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

నగరపాలక సంస్థ అధికారులపై విచారణకు ఆదేశాలు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: అనిశా (అవినీతి నిరోధక శాఖ) అధికారులు చేసిన సిఫార్సుల మేరకు ప్రభుత్వం మచిలీపట్నం నగరపాలక సంస్థకు చెందిన పలువురు అధికారులపై విచారణకు ఆదేశిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 2020 అక్టోబరు 27న ఏసీబీ అధికారులు మచిలీపట్నం నగరపాలక సంస్థలోని వివిధ విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో పట్టణ ప్రణాళికా విభాగంలో లెక్కల్లో చూపని నగదు రూ.8,460 ఉండడాన్ని అనిశా అధికారులు గమనించారు. దీనిపై పలువురు అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ అనిశా ఉన్నతాధికారులు ఇటీవల ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. దీనిలో భాగంగా అప్పటి మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ కేవీ నాగశాస్త్రులు, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్లు వి.జగదీశ్వరరావు, జి.కృష్ణ, టౌన్ సర్వేయర్ జి.రాజబాబు, జూనియర్ అసిస్టెంట్ యర్రంశెట్టి వెంకట పద్మావతి, ప్లైన్‌మెన్ సిద్దినేని పవన్‌కుమార్, వాచ్‌మెన్ రేపల్లె సుబ్బారావులతో పాటు పదవీ విరమణ చేసిన టౌన్‌ప్లాన్ సూపర్‌వైజర్ పటమట వెంకటేశ్వరరావుపై విచారణకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పంచాయతీల ప్రగతికి కార్యాచరణ

కంకిపాడు, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల ప్రగతికి కొత్త పంథా కార్యాచరణకు అన్ని స్థాయిల ఉద్యోగులు సిద్ధం చేయాలని కలెక్టర్ డి.కె.బాలాజీ చెప్పారు. కంకిపాడులోని శ్రీకృష్ణ కల్యాణ మండపంలో గురువారం ఉయ్యూరు, గుడివాడ డివిజన్ల స్థాయిలో 'పీఆర్‌-వన్' పేరుతో కార్యశాల నిర్వహించారు. దీనికి 14 మండలాల కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ స్థిరాదాయ వనరుల పెంపు, వ్యర్థాల నుంచి సంపద తయారీ కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగం, పార్కులు, చెరువు కట్టల అభివృద్ధి, పచ్చదనంతో గ్రామాలు కళకళలాడే విధంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. స్థానిక సమస్య పరిష్కారం, పథకాల అమలుతో పాటు గ్రామాల సుందరీకరణపై దృష్టి పెట్టాలన్నారు. ఈ విధానంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. డీపీవో డాక్టర్ జె.అరుణ, డీఎల్‌పీవో జె.సంపత్‌కుమార్, జడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, డీఎస్‌ఈఆర్ ఆర్.సి.ఆనందకుమార్, 'డ్వామా' పీడీ ఎ.వి.శివప్రసాద్, ఎంపీడీవో అనూష, తహసీల్దార్ భవన్నారాయణ పాల్గొన్నారు.

ఐదెకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నం

✦ గట్లు నిర్మించిన సర్పంచి బంధువు

✦ అడ్డుకున్న గ్రామస్థులు



ప్రభుత్వ భూమిలో తవ్వకాలు



బ్యానర్ ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

ఇంతేరు (కృత్తివెన్ను), న్యూస్‌టుడే: కృత్తివెన్ను మండలం ఇంతేరు పంచాయతీ సత్రపాలెం గ్రామంలో సర్వే నెంబరు 1లో 5 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించడానికి పెదసింగు సర్పంచి మోకమ్మ భర్త సామేరు తమ్ముడైన పెదసింగు రాంబాబు గట్టు నిర్మించి తుమ్మ చెట్లు పొక్లెయిన్‌తో పీకేస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. సర్వే నెంబరు 1, సర్వే నెంబరు-58లో దాదాపు 991 ఎకరాలను గతంలో ఎస్‌కే సాల్ట్ లీజుకిచ్చారు. లీజు సమయం గత రెండేళ్ల కిందటే ముగిసింది. నాటి నుంచి ఎలాగైనా ఆక్రమించాలని అనుకుంటూ అదనుచూసి దసరా సందర్భంలో పనులు ప్రారంభించారు. తీరా విషయం బయటకు రావడంతో తహసీల్దార్ జి.సోమేశ్వరరావును వివరణ కోరగా పనులు ఆపించామని తెలిపారు. వీఆర్వో మావుళ్లరావుతో సాయంత్రం హెచ్చరిక బ్యానర్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అయితే పెదసింగు రాంబాబు ఈ భూమి తనదని, పట్టాలు వచ్చాయని, కాగితాలు చూసుకోమని తెలపడంతో గ్రామస్థులు కృత్తివెన్ను పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి రతన్‌టాటా

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: భారతదేశం గర్వించదగ్గ వ్యక్తి రతన్‌టాటా అని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు నివాళులర్పించారు. గురువారం ఒక ప్రకటనలో రతన్ టాటా మరణం దిగ్భ్రాంతికి గురి చేసిందని పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ వాణిజ్య యవనికపై తనదైన ముద్రవేసిన పారిశ్రామికవేత్త టాటా అని కొనియాడారు. టాటా గ్రూపును 10వేల కోట్ల డాలర్ల సామ్రాజ్యంగా విస్తరింపజేసిన సమర్థ వ్యాపారవేత్త అని పేర్కొన్నారు.

రతన్‌టాటా మరణం దిగ్భ్రాంతికి గురి చేసింది: భారత పారిశ్రామిక దిగ్గజం రతన్‌టాటా మరణం దిగ్భ్రాంతికి గురి చేసిందని మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ పేర్కొన్నారు. గురువారం ఒక ప్రకటనలో రతన్‌టాటా మృతికి సంతాపం తెలిపారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే ధ్యేయంగా టాటా ప్రస్థానం సాగిందని పేర్కొన్నారు. విపత్తుల సమయంలో ఆపన్న హస్తం అందించడంలో టాటాకు ఎవరూ సరికారని కొనియాడారు.

బూరగడ్డ వేదవ్యాస్

రూ.28 లక్షల ఆన్‌లైన్ మోసం

పెనమలూరు, న్యూస్‌టుడే: షేర్ వ్యాపారంలో అధిక లాభాలొస్తాయంటూ కానూరుకు చెందిన వ్యక్తి నుంచి రూ.28 లక్షలు లాగేసిన ఆన్‌లైన్ మోసగాళ్ల ఉదంతం సమాచారం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పి.లక్ష్మణకుమార్ కానూరు దుర్గాగరల్‌లోని విష్ణేశ్వర అపార్ట్‌మెంట్ నివాసి. ఇతని వాట్సాప్‌కు ఇటీవల షేర్ వ్యాపారంపై సమాచారం రాగా.. ఈ మేరకు ఇతను యాప్ డౌన్‌లోడ్ చేసుకొని రూ.28 లక్షలు పెట్టుబడి పెట్టాడు. కొద్ది రోజుల తర్వాత తన పెట్టుబడి లాభాలను తిరిగి తీసుకోవడానికి ప్రయత్నించగా వీలు పడలేదు. దీనిపై యాప్ నిర్వాహకులను సంప్రదించినా స్పందన రాలేదు. బాధితుడు లక్ష్మణకుమార్ ఫిర్యాదు మేరకు పెనమలూరు పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పల్లెపండగ వారోత్సవాలు జయప్రదం చేయండి

అవనిగడ్డ, న్యూస్‌టుడే: ఈ నెల 14 నుంచి 21 తేదీ వరకు జరగనున్న పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కోరారు. గురువారం ఆయన కార్యాలయంలో నిర్వహించిన కూటమి నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో పాటు గ్రామాల అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు పండగ వాతావరణంలో చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలకు అతీతంగా నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. వరద ముంపు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. తెదేపా నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, కూటమి నాయకులు మండలి వెంకట్రామ్, కొల్లూరి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.93/-.

చోరీల నియంత్రణకు ప్రత్యేక చర్యలు : ఎస్పీ

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా చోరీల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, అందులో భాగంగా ముఖ్యమైన కూడళ్లలో 12 వేల నిఘా నేత్రాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని ఎస్పీ గంగాధరరావు పేర్కొన్నారు. గురువారం తోట్లవల్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మోటారు సైకిళ్ల చోరీలో నిందితులను పోలీసులు పట్టుకొని విచారించగా వారి వద్ద నుంచి సుమారు రూ.4 లక్షల విలువైన 12 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు మొవ్వ మండలం చిన్నముత్తేవి గ్రామానికి చెందిన పెంద్రు రాజు, కొక్కిలిగడ్డ చరణ్‌తేజ, ఉడుముల అశోక్, శ్రీకాకుళం సాయికుమార్‌గా గుర్తించామని, వారు చెడు వ్యాసనాలకు బానిసలై నకిలీ తాళాలతో గ్రామాల్లో గట్టు వెంట పెట్టి పొలాల్లోకి వెళ్లే రైతుల మోటారు బైక్‌లను చోరీ మొదలు పెట్టారని తెలిపారు. తోట్లవల్లూరు, చల్లపల్లి, మోపిదేవి, గుడ్లవల్లేరు, కృత్తివెన్ను, పెదపారుపూడి, గూడూరు, పెనమలూరు, తూర్పు గోదావరి జిల్లా పరిసర ప్రాంతాల్లోని పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలు చేశారని తెలిపారు. తోట్లవల్లూరు మండలం కళ్లంవారి పాలెం వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా నిందితులు పట్టుబడ్డారని తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



రికార్డుల పరిశీలనలో ఐజీ జి.వి.జి.అశోక్ కుమార్

నాగాయలంక, న్యూస్‌టుడే: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏలూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్(ఐజీ) జి.వి.జి.అశోక్ కుమార్ అన్నారు. గురువారం వార్షిక తనిఖీల్లో భాగంగా నాగాయలంక పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగాయలంకలో ఈ మధ్యకాలంలో జరిగిన సైబర్‌నేరాలు పెరుగుతున్నాయని చెప్పారు. సైబర్ నేరం జరిగిన 3 గంటల్లో 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే రికవరీ చేసే అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలో డ్రగ్స్, గంజాయి నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బాలికల మిస్సింగ్, చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న కేసుల్లో విచారణ వేగంగా పూర్తిచేసి శిక్ష పడేలా చర్యలు తీసుకుంటున్నట్లు హత్య కేసుల విచారణ పురోగతిని పరిశీలించామన్నారు. వృద్ధురాలి హత్య కేసు మినహా మిగిలిన అన్ని కేసుల్లో నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు. నాగాయలంకలోని పలు గ్రామాల్లో పేర్కొన్నారు. దీపావళి టపాసుల తయారీ విషయంలో అక్రమంగా నిల్వలు వంటి వాటిపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టినట్లు చెప్పారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్, డీఎస్పీ మురళీధర్, అవనిగడ్డ సీఐ యువకుమార్, చల్లపల్లి సీఐ ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

కోర్టు ఉద్యోగికి జైలుశిక్ష

ఉయ్యూరు, న్యూస్‌టుడే: అప్పు తీసుకొని చెల్లని చెక్కు ఇచ్చిన గన్నవరం కోర్టు ఉద్యోగికి ఉయ్యూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి కె.శ్రీహరి.. ఏడాది జైలుశిక్ష విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. న్యాయవాది చంటిబాబు అందించిన వివరాల ప్రకారం.. తోట్లవల్లూరు మండలం దేవరపల్లికి చెందిన ఎం.పరమేశ్వరరెడ్డి నుంచి కంకిపాడు మండలం దావులూరుకు చెందిన ఆర్.పుష్పనాథం 2020 జనవరిలో రూ.10 లక్షలు అప్పు తీసుకున్నాడు. అనంతరం 2021 అక్టోబరులో పరమేశ్వరరెడ్డికి ఎస్‌బీఐ ఉయ్యూరు శాఖ చెక్కు ఇచ్చాడు. దీనిని బ్యాంకులో జమ చేయగా ఖాతాలో నగదు లేదని తిరస్కరించారు. పరమేశ్వరరెడ్డి ఉయ్యూరు జూనియర్ సివిల్ కోర్టును ఆశ్రయించగా.. వాదోపవాదాలు విన్న అనంతరం న్యాయమూర్తి శ్రీహరి పైతీర్పు చెప్పారు. పుష్పనాథంకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీసుకున్న సొమ్ముకు వడ్డీతో సహా రూ.12.70 లక్షలు చెల్లించాలని ఆదేశించారు.

రైల్వే పనుల అడ్డగింత



ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

గన్నవరం గ్రామీణం: తమకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారని గన్నవరం మండలం ముస్తాబాద రైతులు గురువారం ఆందోళనకు దిగారు. స్థానికంగా చేపట్టిన రైల్వే అభివృద్ధి పనులను అడ్డగించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతులు మాట్లాడుతూ.. నాలుగేళ్ల కిందట గ్రామంలో 54 మందికి చెందిన 35 ఎకరాల భూమిని తీసుకున్న ప్రభుత్వం.. రైల్వే అధికారులకు అప్పగించిందన్నారు. రైల్వే ఓవర్ రైల్వే పైవంతెన నిమిత్తం సేకరించిన సదరు భూమిలో తాజాగా డీపీఆర్‌ను రైల్వేశాఖ మార్చుకుందని చెప్పారు. నూతన డీపీఆర్ ప్రకారం సుమారు 30 అడుగుల ఎత్తులో సాధారణ పైవంతెన నిర్మాణాలను గుత్తేదారులు చేపడుతున్నారని తెలిపారు. ఫలితంగా చిన్నపాటి వరద వచ్చినా రైల్వే పైవంతెన ఎగువలో ఉన్న పంట పొలాలన్నీ నీటమునిగే ప్రమాదం ఉందన్నారు. స్థానికంగా నూతన, పాత పట్టాల మధ్య ఉన్న సుమారు 30 ఎకరాల పొలాలను సమీకరించలేదన్నారు. తాజాగా బుడమేరు వరదకి గ్రామం అతలాకుతలం అయ్యిందని. . ఈ ప్రాజెక్టు పూర్తయితే గ్రామం మునిగే పరిస్థితి ఉందన్నారు. ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావులుదృష్టి సారించి రైతులకిచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. రైతులు పాలడుగు సాంబశివరావు, పెదర్ల వెంకటేశ్వరరావు, పాలడుగు రత్నారావు, పి.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

మల్లేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ రేపు

పోతేపల్లి (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: పోతేపల్లి జ్యువలరి పార్క్‌లో శనివారం ఉదయం 8.05 గంటలకు విజయ కనకదుర్గ మల్లేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. శనివారం రాత్రి 9గంటలకు శమీపూజ, అనంతరం స్వామివారి, అమ్మవారి గ్రామ ఊరేగింపు జరుగుతుందని వివరించారు. మధ్యాహ్నం 12గంటలకు అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

14న ఉపాధి హామీ పనులకు శంకుస్థాపన

పెడన: ఈ నెల 14న మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు శంకుస్థాపనలు జరుగుతాయని ఇన్‌ఛార్జి ఎంపీడీవో జయరాం తెలిపారు. మండలానికి రూ.3కోట్ల విలువైన 49 పనుల్లో సిమెంటు రోడ్లు, డ్రెయిన్లు అత్యధికంగా ఉన్నాయని పేర్కొన్నారు.

ఆలయ కమిటీ సభ్యులకు సత్కారం


కమిటీ సభ్యులను అభినందిస్తున్న స్థానికులు

పెడన, న్యూస్‌టుడే: స్థానిక వీరభద్రపురంలోని చౌడేశ్వరీ దేవాలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించి 25 ఏళ్ల పూర్తయిన నేపథ్యంలో ఆలయ ప్రథమ ఉత్సవ కమిటీ సభ్యులను స్థానికులు గురువారం సత్కరించారు. ఆలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో అప్పటి కమిటీ సభ్యులు వార్త హేమాద్రి, బళ్ల కోట వెంకట సుబ్బారావుతో పాటు పూజారి కుర్మా దుర్గాప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు. గత 25 ఏళ్లుగా ఉత్సవాలను సమర్థంగా నిర్వర్తించడంలో ఈ ముగ్గురి కృషి ఎనలేనిదన్నారు. కౌన్సిలర్ కటకం ప్రసాద్, కట్టా మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పురుగు మందు కలకలం

ప్రజాదర్బార్‌లో జింజేరు రైతు ఫిర్యాదు


నష్టపోయిన రైతు నుంచి వివరాలు సేకరిస్తున్న శాస్త్రవేత్తలు

పెడన, న్యూస్‌టుడే: పెడన మండలం జింజేరులో నకిలీ పురుగు ముందు కలకలం రేపింది. ఈ గ్రామానికి చెందిన రైతు మొవ్వ గోవర్ధనరావు దోమపోటుకు వినియోగించిన పురుగు ముందు నకిలీదిగా నిర్ధారణ కావడంతో ఈ నెల 7న పెడనలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు నకిలీ పురుగుమందుపై గురువారం క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించారు. రైతు గోవర్ధనరావు అదే గ్రామానికి చెందిన ధాన్యం కమీషన్ వ్యాపారి మామిడి లక్ష్మీనారాయణ నుంచి రుణంపై ఆ పురుగు మందు తీసుకున్నారు. ఈ మందును తమ 11 ఎకరాల ఎంటీయూ 1224 వరి పంటలో దోమకాటు నివారణకు వినియోగించగా దోమ ప్రభావం మరింత పెరిగి పొలంలో సుడులు ఏర్పడ్డాయి. ఫలితంగా పైరు ఎదుగుదల నిలిచిపోయింది. దీంతో ఆందోళన చెందిన రైతు పెడనలోని వ్యాపారులను సంప్రదించగా ఆ మందు నకిలీదిగా తేల్చారు. దీనిపై ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేయడంతో అధికారులు స్పందించారు. గుంటూరు లాం శాస్త్రవేత్తలు డా.ఎస్‌వీఎస్ గోపాలస్వామి, డా.ఎన్.సాంబశివరావు, వ్యవసాయ పరిశోధన స్టేషన్, మచిలీపట్నం శాస్త్రవేత్త డా.కె.నాగేంద్రరావులు జింజేరు వెళ్లి వరి పొలాన్ని పరిశీలించి నకిలీ పురుగు మందు వినియోగించినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ బృందంలో డిప్యూటీ డైరెక్టర్ మనోహరరావు, ఇన్‌ఛార్జి వ్యవసాయాధికారిణి నూరున్నీసా తదితరులున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని అధికారులు చెప్పారు. దీర్ఘకాలంగా కమీషన్ వ్యాపారి నకిలీ పురుగు మందులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సదరు వ్యాపారికి వ్యవసాయశాఖ లైసెన్సులు కూడా లేవని సమాచారం.

జలవనరుల శాఖలో బదిలీలు

పెడన, న్యూస్‌టుడే: జలవనరుల శాఖ కౌతవరం సెక్షన్ ఏఈగా వల్లూరు లక్ష్మీ తులసీ నియమితులయ్యారు. ఆమె ఐటీడీఏ కొత్త రామచంద్రపురం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. కౌతవరం సెక్షన్‌లో పెడన మండలంలోని అత్యధిక గ్రామాలు వస్తాయి. బంటుమిల్లి ఏఈ వెంపటి చిననాగేశ్వరరావును పెడన డ్రెయినేజి సెక్షన్ ఏఈగా నియమించారు. బంటుమిల్లి ఇన్‌ఛార్జి బాధ్యతలను కృత్తివెన్ను ఏఈ రాజ్యలక్ష్మికి అప్పగించారు. కమలాపురం లాక్ సూపరింటెండెంట్‌గా పామర్రు నుంచి నాగరాజును నియమించారు. ఇక్కడ డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ముత్యాలరాణిని తిరిగి కైకలూరు మండలం వింజరం లాకులకు పంపించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

మచిలీపట్నం (గొడుగుపేట): ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నగరంలోని శివగంగ స్వాతి పాఠశాల ఆవరణలో అజ్మీర్ బాబా సేవా సమాజం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైజ్‌మెన్ క్లబ్ అధ్యక్షుడు ఆప్తాల్మిక్ టెక్నీషియన్ వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఆయనతో పాటు అవేర్ ఆసుపత్రి వైద్యులు నేతి ప్రభాకర్ కంటి సమస్యలు, నివారణపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపల్ ప్రవీణ్, ఉపాధ్యాయులు కంటి పరీక్షలు చేసిన సయ్యద్‌పీర్‌ను సత్కరించారు.

అలంకారప్రాయం.. నిర్వహణ శూన్యం..

మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల దుస్థితి

న్యూస్‌టుడే, పెడన

పెడన మున్సిపల్ పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్‌లు అలంకారప్రాయంగా మారాయి. పట్టణంలో గతంలో ఐదుచోట్ల అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ కాంప్లెక్స్‌లకు ఆదరణ లేక పురపాలికకు ఆదాయాన్ని సమకూర్చడంలో వెనుకంజ వేస్తున్నాయి. ఇక లీజుదారులు అద్దెలు చెల్లించడంలో నిర్లక్ష్యం కారణంగా రూ.లక్షల బకాయిలు పేరుకుంటున్నాయి.

పట్టణంలో ప్రధానంగా బస్టాండు సెంటరులోని మహాత్మాగాంధీ కాంప్లెక్స్ నుంచి అత్యధిక ఆదాయం సమకూరుతోంది. ఆ తర్వాత పాత కూరగాయల మార్కెట్, బంటుమిల్లి రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డులోని మహిళా వాణిజ్య సముదాయం, కొత్తపేట కాంప్లెక్స్‌లు నిలుస్తాయి. సరైన నిర్వహణ లేక కాంప్లెక్స్‌ల్లోని షాపులను అద్దెకు తీసుకునేందుకు వ్యాపారులు ఆసక్తి చూపించడం లేదు. ఈ కాంప్లెక్స్‌లను పదేళ్ల కిందట నిర్మించగా ఇప్పటివరకు కనీస నిర్వహణ చేపట్టకపోవడంతో పరిస్థితులు అధ్వానంగా మారాయి. ఇక వాష్‌రూములు అనుసంధానంగా లేకపోవడం కూడా ఇబ్బందికరంగా మారింది. కొన్నిచోట్ల పెచ్చులూడి మీద పడుతున్నా అధికారులు స్పందించడం లేదు. పైకప్పు నుంచి వర్షం నీరు కారడం మరింత ఇబ్బందిగా మారింది. ఫలితంగా ఈ కాంప్లెక్స్‌లకు ఆదరణ లేక వెలవెలబోతున్నాయి.


మహాత్మాగాంధీ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్

పేరుకున్న బకాయిలు..

★ **మహాత్మాగాంధీ కాంప్లెక్స్ నుంచి** రూ.10.88అత్యధికంగా లక్షలు వసూలు కావాల్సి ఉంది. ఒక లీజుదారు గత 26 నెలల నుంచి అద్దె చెల్లించడం లేదు. ఈ కాంప్లెక్స్‌లోని మరో ముగ్గురు లీజుదారులు కూడా 13 నెలలకు పైగా బకాయి ఉన్నారు.

★ **బంటుమిల్లి రోడ్డు కాంప్లెక్స్‌లో** ఇరువురు లీజుదారులు 11, 17 నెలల నుంచి అద్దెలు చెల్లించడం లేదు.

★ **మహిళా వాణిజ్య సముదాయంలో** ఒక లీజుదారుని నుంచి 13 నెలలుగా అద్దెను మున్సిపల్ రెవెన్యూ అధికారులు వసూలు చేయడం లేదు.

★ **పాత కూరగాయల కాంప్లెక్స్‌లోనూ** ఇదే పరిస్థితి నెలకొంది. మొత్తం మీద ఈ ఐదు కాంప్లెక్స్‌ల నుంచి రూ.13.04లక్షల బకాయిలు లీజుదారులు చెల్లించాల్సి ఉంది.

రెవెన్యూలో నిర్లిప్తత...

మున్సిపల్ రెవెన్యూ విభాగం కాంప్లెక్స్ అద్దెల వసూలు బాధ్యతలను చేపడుతుంది. ప్రతి నెలా లీజుదారుల వద్దకు వెళ్లి అద్దెలు వసూలు చేయాల్సి ఉన్నా ఆ విధులను నిర్వర్తించడం లేదు. సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన తర్వాత కూడా ఈ బాధ్యతలను ఉద్యోగులకు అప్పగించడంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కన్పిస్తోంది. మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగ విరమణ సమీపించడంతో ఆయన పెద్దగా దృష్టి సారించడం లేదు. ఈ విభాగంలో పనిచేస్తున్న ఇద్దరు ఒప్పంద ఉద్యోగులు ఇదే తీరులో నిర్లక్ష్యంగా విధులను నిర్వర్తిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. లీజుదారు మున్సిపల్ కార్యాలయానికి వచ్చి అద్దె చెల్లిస్తామన్నా సరైన తీరిలో స్పందన కన్పించడం లేదు. ఫలితంగా నెలకు దాదాపు రూ.10లక్షల ఆదాయాన్ని సమకూర్చాల్సిన కాంప్లెక్స్‌లు ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగా ఆదాయంలో వెనుకంజ వేస్తున్నాయన్న విమర్శలు ఉన్నాయి.

సమీక్షించి చక్కదిద్దుతాం

– ఎం.గోపాలరావు, మున్సిపల్ కమిషనర్

పురపాలిక ఆదాయంలో ప్రధానమైన కాంప్లెక్స్‌ల నిర్వహణను సమర్థంగా నిర్వర్తిస్తూ తద్వారా లీజుదారుల సంఖ్యను పెంపొందిస్తాం. ప్రస్తుతం ఖాళీగా ఉన్న షాపులన్నీ నిండేలా చర్యలు తీసుకుంటాం. మౌలిక సదుపాయాల్ని పెంచేందుకు అవసరమైన నిధుల్ని కేటాయిస్తాం. రెవెన్యూ విభాగాన్ని అప్రమత్తం చేసి ప్రతినెలా లీజుదారుల నుంచి అద్దెలు వసూలు చేస్తాం. ఈ దిశగా త్వరలో సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తాం.

‘గోధ్వజస్థాపన’కు తరలిన నాయకులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: విజయవాడలో గురువారం నిర్వహించిన గోధ్వజ స్థాపన కార్యక్రమానికి మచిలీపట్నం నుంచి బ్రాహ్మణ సంఘ నాయకులు, గోప్రేమికులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అవిముక్తేశ్వరానంద సరస్వతి స్వామీజీ దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానుల్లో గోధ్వజాన్ని స్థాపించేందుకు కృషి చేస్తున్నారని, దీనిలో భాగంగా విజయవాడలోని సత్యనారాయణపురం శివరామకృష్ణ క్షేత్రంలో గోధ్వజస్థాపన జరుగుతుందన్నారు. రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన నాయకులు వేమూరి రామకృష్ణ, గోధ్వజ స్థాపన యాత్ర కార్యనిర్వహణ కమిటీ సభ్యుడు పీవీ ఫణికుమార్‌తో ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి, సూరిశెట్టి హరికృష్ణ, మోపర్తి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

టెట్‌కు 83.54 శాతం హాజరు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: జిల్లాలోని వివిధ కేంద్రాల్లో నిర్వహిస్తున్న టెట్ పరీక్షలు సజావుగా సాగుతున్నాయని డీఈవో తాహెరా సుల్తానా ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం రెండు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా 370 మందికి 306 మంది హాజరయ్యారు. 64 మంది గైర్హాజరయ్యారని, మధ్యాహ్నం 3 కేంద్రాల్లో పరీక్షలు జరగ్గా 1337 మందికి 1128 మంది హాజరయ్యారని, 209 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మొత్తం 83.54 శాతం హాజరు నమోదైందని తెలిపారు.

మానసిక ఆరోగ్యం పెంపొందించుకోవాలి



ర్యాలీలో న్యాయమూర్తి కేవీఆర్ కృష్ణయ్య, సుందరాచారి తదితరులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: శారీరకంగానే కాకుండా ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కేవీఆర్ కృష్ణయ్య అన్నారు. గురువారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మచిలీపట్నం సర్వజన ఆసుపత్రి, జిల్లా న్యాయసేవాధికార సంస్థల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలు వివిధ రకాల ఒత్తిళ్లకు గురై మానసికంగా ఇబ్బదులు పడుతున్నారన్నారు. అందరూ ఒత్తిడి ఉపశమన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ సుందరాచారి మాట్లాడుతూ శారీరకంగా ఆరోగ్యంగా ఉంటే ఏ వ్యాధి లేనట్టు కాదని, మానసికంగా కూడా ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఆర్ఎంవో డా.నిరంజన్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.శ్రీనివాస్‌లు, న్యాయవాదులు పాల్గొన్నారు.


కృత్తివెన్ను దుర్గాపార్వతీ ఆలయంలో ..


బందరు: దుర్గాదేవిగా..


పెడన: చౌడేశ్వరీదేవి..


ఎస్.ఎన్.గొల్లపాలెంలో..


బలరామునిపేటలో..

కరుణించమ్మా.. కనకదుర్గమ్మా

దసరా ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గురువారం ఆయా ఆలయాల్లో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కన్యకాపరమేశ్వరీ ఆలయంలో నిర్వహించిన కుమారి పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గూడూరు మండలంలోని పలు ఆలయాల్లో విశేషపూజలు నిర్వహించారు.

-న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట), కృత్తివెన్ను, మచిలీపట్నం గ్రామీణ, గూడూరు, పెడన, బంటుమిల్లి


ఎస్.ఎన్.గొల్లపాలెంలో కుంకుమార్చన


కన్యకాపరమేశ్వరీ ఆలయంలో భక్తిగీతాలు ఆలపిస్తూ..


బందరు: మహాలక్ష్మి అలంకారం


పెదతుమ్మిడి శివాలయంలో..


మంగినపూడిలో..


పెడన: ఎంజేఆర్ కాలనీలో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ పూజలు


పెడన: తీర్థపు బిందెతో ఉత్సవ కమిటీ సభ్యల ఊరేగింపు


ఐదుగుళ్లపల్లిలో..

రహదారి ఛిద్రం.. ప్రయాణం నరకం


ఆంజనేయస్వామి ఆలయం పక్కన ఇలా..

మచిలీపట్నం మండల పరిధిలోని హుస్సేన్‌పాలెంలో రహదారి గుంతలతో అధ్వానంగా మారింది. ఆంజనేయ స్వామి ఆలయం నుంచి చిట్టిపాలెం వెళ్లే రహదారి గోతులతో నిండిపోయింది. వర్షం కురిస్తే గుంత ఏదో, రోడ్డు ఏదో తెలియడం లేదు. వాహనదారులు గుంతల రోడ్డుపై ప్రయాణించేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో స్థానికులే కొన్ని గుంతలను పూడ్చారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- హుస్సేన్‌పాలెం (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే


హుస్సేన్‌పాలెం-చిట్టిపాలెం దారి దుస్థితి

వివాహిత ఆత్మహత్యాయత్నం

నివారించిన మెరైన్ పోలీసులు


శాంతితో మెరైన్ పోలీసులు, ఫొటోగ్రాఫర్లు

మంగినపూడి (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: భర్తతో మనస్పర్థల కారణంగా ఆత్మహత్య చేసుకునేందుకు మంగినపూడి బీచ్‌కు వచ్చిన మహిళను మెరైన్ పోలీసులు కాపాడారు. మచిలీపట్నం పాత రైల్వేస్టేషన్ సమీపంలో ఉండే బకురి శాంతికి భర్త కిరణ్‌కుమార్‌తో మనస్పర్థలు ఏర్పడి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. మూడు నెలల బిడ్డతో సహా మంగినపూడి బీచ్ చేరుకున్న శాంతికి ఆత్మహత్య చేసుకునేందుకు ధైర్యం చాలలేదు. నిస్సహాయతతో ఏడుస్తున్న శాంతిని గమనించిన బీచ్ ఫొటోగ్రాఫర్లు మెరైన్ ఎస్సై పరింకాయల మురళీకృష్ణకు సమాచారం తెలిపారు. శాంతిని ఓదార్చిన ఎస్సై మురళీకృష్ణ గిలకలదిండి ఇన్‌స్పెక్టర్ వంశీకృష్ణకు తెలియజేసి ఆయన సూచనల మేరకు కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. శాంతిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పెనమలూరు
• పెనమలూరు • గన్నవరం


యనమలకుదురు రామలింగేశ్వరాలయంలో..


హనుమాన్‌జంక్షన్: వాసవీమాత ఆలయంలో..

దుర్గామాతకు నీరాజనం


యనమలకుదురు శ్రీకనకదుర్గ ఆలయంలో..


పెనమలూరులో కుంకుమ పూజలు


హనుమాన్‌జంక్షన్: వీరవల్లిలో..


రామవరప్పాడులో..


పోరంకి: శ్రీనివాసనగర్ శిర్డీ సాయిబాబా ఆలయంలో..


కంకిపాడు: మద్దూరులో..


కంకిపాడు: మువ్వగోపాల ఆర్ట్స్ విద్యార్థుల ప్రదర్శన


ఉయ్యూరు గ్రామీణం: వీరవల్లిమొఖాసాలో..


పాతగన్నవరంలో..


ఉయ్యూరు గ్రామీణం: సాయిపురంలో..



పోరంకి: నారాయణపురం కాలనీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో..


ఉయ్యూరు శివాలయంలో..

పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవ మండపాలు, వివిధ ఆలయాల్లో అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు, హోమాలు, భజనలు నిర్వహిస్తున్నారు. గురువారం అమ్మవారు పలుచోట్ల శ్రీదుర్గాదేవిగా దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ప్రాంగణాలు కిటకిటలాడాయి. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

- న్యూస్‌టుడే బృందం


కంకిపాడు గ్రామీణం: ప్రొద్దుటూరు శివాలయంలో..



ఉంగుటూరు: ఆత్కూరులో..


కానూరు: తాడిగడప రామాలయంలో..


ఉయ్యూరు: విజయ దుర్గాభవాని ఆలయంలో


కంకిపాడు గ్రామీణం: ఉప్పులూరులో..


కానూరు: తాడిగడప గ్రీన్‌సిటీలో..


ఎనికేపాడు: శ్రీ సాయి గీతామందిర్‌లో..

వంతెన పనులు త్వరగా పూర్తి చేయండి

కానూరు, న్యూస్‌టుడే: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న పైవంతెన పనులను ఎమ్మెల్యే బోడే ప్రసాద్ గురువారం పరిశీలించారు. సత్వరమే వీటిని పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం వంతెనపై సౌండ్ బ్యారియర్లను పరిశీలించారు. తెదేపా నాయకులు అనుమోలు ప్రభాకరరావు, మారుపూడి ధనకోటేశ్వరరావు, డీన్ బావినేని పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్, తెదేపా నాయకులు

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: పల్లెల్లో పారిశుద్ధ్య సమస్యలు అన్నవి కనిపించకూడదని.. డ్రెయిన్ల పూడిక, తాగు నీరు, చిన్నపాటి రోడ్లు ఇతర సమస్యలను సత్వరమే అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే తన క్యాంప్ కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. డ్రెయిన్ల పూడిక, మురుగు, తాగు నీరు లాంటి చిన్నపాటి సమస్యలపై అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని.. క్షేత్ర స్థాయి అధికారులు అవి కూడా పట్టించుకోకుంటే ఏమి పనిచేస్తున్నట్లు అని నిలదీశారు. ఈ నెల 14వ తేదీ నుంచి చేపట్టే పల్లె పండగను విజయవంతంగా నిర్వహించేందుకు సమాలోచనలు చేశారు. విజయవాడ రూరల్ మండలంలో రూ.3.10 కోట్లతో 12 సీసీరోడ్లు, బాపులపాడులో రూ.76లక్షలతో మరో 5, ఉంగుటూరులో రూ.1.73కోట్లతో 11, గన్నవరం మండలంలో రూ.1.97 కోట్లతో 9 సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. వెటర్నరీ కళాశాల ప్రహరీ సుందరీకరణకు నిధులు, ఇతర సమస్యలపై చర్చించి పలు సూచనలు చేశారు. ఎంపీడీవోలు స్వర్ణలత, సత్య కుమార్, జోగేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

విద్యుత్తు సమస్యలు పరిష్కరించండి

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: విద్యుత్తు సరఫరా మెరుగుపర్చి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని వేలేరు రైతులు విజ్ఞప్తి చేశారు. గురువారం వేలేరు విద్యుత్తు ఉపకేంద్రంలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మార్పిడి పనుల్ని పరిశీలించేందుకు సీపీడీసీఎల్ ఆపరేషన్స్ ఈఈ బీవీ సుధాకర్, హనుమాన్‌జంక్షన్ డీఈఈ బి.శ్రీనివాసరావులు గ్రామంలో పర్యటించారు. తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు నేతృత్వంలో రైతులు పలు సమస్యలను ఈఈకు విన్నవించారు. వ్యవసాయ బోర్ల కనెక్షన్లకు, స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉండడం వల్ల తరచూ ఇబ్బందులు తలెత్తుతున్నాయని, నియంత్రికలు చోరీకు గురైన సమయంలో కొత్తది అమర్చే ప్రక్రియలో తీవ్ర జాప్యం నెలకొంటోందని, 24 గంటల వ్యవధిలో కొత్త నియంత్రిక ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని, గ్రామంలో మరో లైన్‌మ్యాన్ పోస్టును భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు అవిర్నేని భవానీశంకర్, కాజా సురేష్, అంగడాల సీతారామయ్య, గోళ్ల శివనాగమల్లేశ్వరరావు, పాతూరి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.


ఈఈ సుధాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న వేములపల్లి తదితరులు

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని 20 గ్రామాల్లో గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు చేపట్టిన ఉపాధి పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీ వివరాలను వెల్లడించారు. రూ.8.85 కోట్ల విలువైన పనులు జరిగినట్లు ద్వామా పీడీ శివప్రసాద్, ఏపీడీ నందాకాలులు తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో మండలంలోని 20 గ్రామాల్లో ఉపాధి హామీ నిధుల వినియోగంపై ఆరా తీశారు. ఎంపీడీవో అనురాధ, కె.వి.శ్రీనివాసరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆదర్శం రతన్‌టాటా

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: రతన్‌టాటా మాలాంటి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు స్ఫూర్తిదాయకమని పుట్టగుంట సతీష్‌కుమార్ తెలిపారు. వయసుతో సంబంధం లేకుండా వినూత్న ఆలోచనలతో వ్యాపారంలో ముందుకు దూసుకు వెళ్లడం, అంతే వేగంతో తాను సంపాదించిన దాంట్లో కొంత మొత్తాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించడంలో ఆయనకు ఆయనే సాటి అని పేర్కొన్నారు. నవ్యాంధ్ర తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాష్ట్రంలో పెట్టుబడుల్ని ఆహ్వానిస్తూ 2015లో విజయవాడలో సదస్సు నిర్వహించగా.. ఛాంబర్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ హోదాలో రతన్‌టాటాతో కలిసి పాల్గొనే అవకాశం తనకు లభించడం గొప్ప అనుభూతిగా నిలిచిపోయిందని పుట్టగుంట తెలిపారు. ఆయన మృతి దేశానికి తీరని లోటు అని పేర్కొన్నారు.

కానూరు, న్యూస్‌టుడే: దేశం గొప్ప పారిశ్రామికవేత్తను కోల్పోయిందని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కన్వీనర్ జమీల్ అహమ్మద్‌బేగ్ అన్నారు. గురువారం తాడిగడపలో జరిగిన కార్యక్రమంలో రతన్‌టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఉప్పు నుంచి ఉక్కు వరకు అన్నిరంగాల్లో రతన్‌టాటా ప్రవేశించి తనదైన శైలిలో సామ్రాజ్యం విస్తరించారన్నారు.


రతన్‌టాటా, చంద్రబాబుతో పుట్టగుంట సతీష్‌కుమార్(పాత చిత్రం)

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో రాష్ట్రం అన్ని విధాలా వెనకబడిందని తెదేపా సీనియర్ నాయకుడు యలమంచిలి కిషోర్‌బాబు అన్నారు. విశాఖలో టీసీఎస్ కంపెనీ రానుండడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనత సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లదే నన్నారు. తెదేపా అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు పూర్తవకుండానే రాష్ట్రంలోకి అనేక ప్రాజెక్టులు వస్తున్నాయన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

పెనమలూరు, న్యూస్‌టుడే: కానూరు తులసీనగర్‌లో అక్రమంగా నిల్వ చేసిన 15 బస్తాల రేషన్ బియ్యాన్ని పెనమలూరు పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం.. తులసీనగర్ గోదాములో పౌరసరఫరాల శాఖకు చెందిన బియ్యం బస్తాలను అక్రమంగా నిల్వ చేసినట్లు బుధవారం రాత్రి పెనమలూరు ఎస్సై రమేష్‌కు సమాచారం అందింది. దీంతో ఆయన సిబ్బందితో కలిసి గోదాముపై దాడి చేసి 15 బస్తాల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఇంటింటికీ రేషన్ సరఫరా చేసే వ్యాన్ డ్రైవర్ షేక్ మునాఫ్ వీటిని తక్కువ ధరకు కొనుగోలు చేసి సనత్‌నగర్ రేషన్ డీలర్ సుధాకర్‌కు అధిక ధరకు విక్రయిస్తున్నట్లు ఎస్సై విచారణలో గుర్తించారు. వ్యాను డ్రైవర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవానీ భక్తుల వసతి శిబిరానికి స్పందన

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: బొమ్ములూరు వద్ద పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో భవానీ భక్తుల సౌకర్యార్థం గత ఏడు రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక వసతి శిబిరానికి భారీగా భక్తులు తరలి వస్తున్నారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువు దీరిన కనకదుర్గమ్మ సన్నిధికి వెళుతున్న భవానీలకు ఉపయుక్తంగా ఉండేలా ఇక్కడ రెండు పూటలా అల్పాహారం, భోజనంతో పాటు, విశ్రాంతి తీసుకునేందుకు బస, ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి నడచి వస్తున్న భక్తుల పాదాలకు బొబ్బలు రావడంతో సతీష్‌కుమార్ గురువారం స్వయంగా వారి పాదాలకు లేపనం రాశారు.

ఉత్సాహంగా స్వాగత వేడుకలు

గంగూరు(పెనమలూరు), న్యూస్‌టుడే: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ సీనియర్స్ గురువారం ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. కూచిపూడి, జానపద ప్రదర్శనలతో విద్యార్థులు సందడి చేశారు. కళాశాల ఛైర్మన్ ధనేకుల రవీంద్రనాథ్‌ఠాగూర్, ప్రిన్సిపల్ కడియాల రవిలు.. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాశాల డైరెక్టర్ రవిప్రసాద్, కార్యదర్శి భవానీప్రసాద్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 471 దరఖాస్తులు

ఉయ్యూరు, న్యూస్‌టుడే: ఉయ్యూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అయిదు మండలాల్లోని 30 మద్యం దుకాణాలకు గురువారం సాయంత్రం నాటికి 471 దరఖాస్తులు వచ్చాయని సీఐ శేషగిరిరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం వరకు స్వీకరణకు సమయం ఉందని పేర్కొన్నారు.

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

మానసిక ఆరోగ్యం కాపాడుకోవాలి



చిన్నారిని పరిశీలిస్తున్న 11వ జిల్లా అదనపు న్యాయమూర్తి జి.సుబ్రహ్మణ్యం

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజల ఆరోగ్యంతోపాటు వారి మానసిక ఆరోగ్య పరిరక్షణకు ఆసుపత్రిలో తగిన చర్యలు తీసుకోవాలని గుడివాడ 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం తనిఖీ చేసి అక్కడ అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సౌకర్యాలు, డాక్టర్ల పర్యవేక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. బాలురు, మానసిక వికలాంగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఇందిరాదేవి, న్యాయవాదులు పీవీ రాజు, రఫి, కుటుంబరావు, లక్ష్మీనారాయణ, సూర్య, శివరామకృష్ణ పాల్గొన్నారు.

సామాజిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీలో న్యాయమూర్తి బాబూనాయక్

అవనిగడ్డ, న్యూస్‌టుడే: సీనియర్ సివిల్ జడ్జి బి.బాబూ నాయక్ గురువారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. మెంటల్ హెల్త్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆసుపత్రిలోని అన్ని వార్డులను సందర్శించారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆయన వెంట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సనకా రఘురామ్ ప్రసాద్, ఏపీపీ చిట్టిప్రోలు ప్రసాద్, ఉచిత న్యాయసహాయ న్యాయవాది దామెర్ల నాగరాజు ఉన్నారు. ఆసుపత్రి తనిఖీ సమయంలో న్యాయమూర్తికి వాట్సప్‌లో ఓ సందేశం రావడంతో దానిపై ఆయన స్పందించారు. ఆసుపత్రి సూపరింటెండెంటును వివరణ కోరారు. దీనిపై జిల్లా న్యాయ సేవాసంస్థకు సమాచారం ఇస్తానని చెప్పారు.

త్రిశంకుస్వర్గంలో కొండలమ్మ దేవస్థానం ఉత్సవ కమిటీ

దసరా ముందే జాబితా పంపినా ఇంతవరకూ రాని అనుమతి

వేమవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: కొండలమ్మ దేవస్థానంలో దేవీశరన్నవరాత్రుల నిర్వహణ కోసం ఉత్సవ కమిటీకి అధికారిక అనుమతి లేక త్రిశంకుస్వర్గంలో ఉంది. అధికార పార్టీ నాయకులు కమిటీని ప్రతిపాదించి దేవాదాయశాఖకు దసరాకు ముందే జాబితా పంపినా నేటికీ అనుమతులు రాలేదు. జూన్‌లో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వైకాపా హయాంలో ఏర్పాటైన కమిటీ రాజీనామా చేయడంతో అప్పటి నుంచి అధికారిక కమిటీ లేదు. సెప్టెంబరు చివరివారంలో 9 మంది పేర్లతో ఎమ్మెల్యే కార్యాలయం నుంచి దేవాదాయశాఖకు జాబితా పంపించినా అనుమతి రాలేదు. ఉత్సవాలు మరో రెండు రోజులు మాత్రమే మిగిలాయి. ఈ నెల 3న ఉత్సవాల తొలి రోజున ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కమిటీ సభ్యులను పరిచయం చేసి కండువాలు కప్పారు. పేరుకు ఉత్సవ కమిటీగా అందరికీ పరిచయమైనా, ఇప్పటి వరకూ అధికార అనుమతి లేకపోవడంతో తమ పరిస్థితి ఏంటని సభ్యుల్లో అయోమయం నెలకొంది. దీనిపై ఆలయ ఈవో కొండలరావు వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా 9 మందితో ఉత్సవ కమిటీ జాబితాను దేవాదాయశాఖకు పంపామని, ఇంతవరకూ అనుమతి రాలేదని, అందుకే ఉత్సవ కమిటీ పేర్లను అధికారికంగా ఎక్కడా వెల్లడించడం లేదన్నారు.



ఉత్సవ కమిటీగా ఎంపిక చేసిన సభ్యులతో ఎమ్మెల్యే రాము(పాత చిత్రం)

సచివాలయ వ్యవస్థపై సమీక్ష

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి మండలంలో సచివాలయ వ్యవస్థపై అధ్యయనం చేసేందుకు పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్ ఆనంద్ సంస్థ అసోసియేట్ డీన్ వి.ఎస్.మహాదేవ్ చల్లపల్లి-2 సచివాలయానికి గురువారం చేరుకున్నారు. సచివాలయాన్ని పంచాయతీలో విలీనం చేయాలా? కొనసాగించాలా? సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, మార్పులు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచి పైడిపాముల కృష్ణకుమారి, కార్యదర్శి పి.వి.మాధవేంద్రరావు, సచివాలయ ఉద్యోగులతో వేర్వేరుగా మాట్లాడారు. పంచాయతీరాజ్ కమిషనర్‌కు నివేదికను సమర్పించనున్నట్లు మహాదేవ్ చెప్పారు.

కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేద్దాం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: కూటమి ఎమ్మెల్సీ పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయానికి కృషిచేద్దామని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన కార్యాలయంలో జరిగిన కూటమి నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేసే కార్యక్రమం వేగవంతం చేయాలని కోరారు. తెదేపా నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఓటరుగా నమోదు ప్రక్రియ విధానాన్ని వివరించారు.

ఓటర్లుగా నమోదు చేసుకోండి

ఘంటసాల, న్యూస్‌టుడే: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు తెలిపారు. ఘంటసాల సచివాలయంలో ఉద్యోగులను ఆయన కలిశారు. సంఘం నాయకులు చెరుకూరి శ్రీనివాసరావు, వేణు గోపాల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ వాహనాల తనిఖీ

నాగాయలంక, న్యూస్‌టుడే: మండలంలో పలు రేషన్ పంపిణీ వాహనాలను గురువారం పీడీఎస్ డీటీ ఖాసింబాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఇటీవలి కాలంలో కొందరు రేషన్ బియ్యం నిల్వ ఉంచి అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డారని, అక్రమ రేషన్ తరలింపును నివారించేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సేవలో ప్రముఖులు



చక్రవర్తికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఈవో వరప్రసాద్

మోపిదేవి, న్యూస్‌టుడే: సినీ హీరో జేడీ చక్రవర్తి గురువారం మోపిదేవి శ్రీవల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించి మొక్కుబడులు సమర్పించారు. వేద పండితులు ఆయన్ను ఆశీర్వదించారు. ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాద్ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందించి శేషవస్త్రాలతో సన్మానించారు.

మోపిదేవి, న్యూస్‌టుడే: ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ గురువారం మోపిదేవి వల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆయన వెంట జిల్లా ఎస్పీ గంగాధరరావు ఉన్నారు. నాగపుట్టవద్ద పాలుపోసి నాగదేవతను కొలిచారు. స్వామికి నిర్వహించిన పంచామృతాభిషేక పూజలో పాల్గొన్నారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ శ్రీరామ వరప్రసాద్ ఐజీ, ఎస్పీలకు స్వామివారి చిత్రపటం అందించారు.

అమ్మవారి సేవలో ఎమ్మెల్యే కుటుంబం

చల్లపల్లి, న్యూస్‌టుడే: కళలను ప్రోత్సహించడంలో ఆర్యవైశ్య సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. దేవీశరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా చల్లపల్లిలోని కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్-విజయలక్ష్మి దంపతులు, కుమార్తె-అల్లుడు శీలం కృష్ణప్రభ-అశ్వినీకుమార్ దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం నృత్య ప్రదర్శనలు చేసిన చిన్నారులను ఎమ్మెల్యే అభినందించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొల్లిపర మధు, కార్యదర్శి అన్నవరపు పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

నేటితో ముగియనున్న శ్రీమద్భాగవత సప్తాహం



బొమ్మల కొలువు తిలకిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా, గురుదేవులు గౌరకృష్ణ తదితరులు

పెదముత్తేవి(కూచిపూడి), న్యూస్‌టుడే: యతీంద్ర సేవాసమితి(పెదముత్తేవి), మాస్టర్ ఇ.కె.ఆధ్యాత్మిక సేవా సంస్థ(విశాఖపట్నం)ల నిర్వహణలో పెదముత్తేవి శ్రీకృష్ణాశ్రమంలో కొనసాగుతున్న శ్రీమద్భాగవత సప్తాహంలో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈనెల 5వ తేదీన శ్రీమాన్ ఎక్కిరాల అనంతకృష్ణ గురుదేవులు, శ్రీమాన్ గౌరకృష్ణ గురుదేవుల నిర్వహణలో నిర్వహిస్తున్న శ్రీమద్భాగవత సప్తాహం శుక్రవారంతో ముగియనుంది. ఆశ్రమంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు, అభయ వీరాంజనేయస్వామి పూజల్లో ఎమ్మెల్యే కుమార్‌రాజాతోపాటు పామర్రు జనసేన ఇన్‌ఛార్జి తాడిశెట్టి నరేష్ పాల్గొన్నారు.

నేత్రదానం

చల్లపల్లి: లక్ష్మీపురం పంచాయతీ సాలిపేటకు చెందిన బలుసుపల్లి బాలరాజు(69) అనారోగ్యంతో మృతిచెందారు. ఈ నేపథ్యంలో ఆయన రెండు నేత్రాలను కుటుంబ సభ్యులు గురువారం దానం చేశారు. నాగాయలంకకు చెందిన సుదర్శి మానవతా సేవాసంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్ ద్వారా విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు వచ్చి రెండు నేత్రాలను సేకరించారు.

కోడూరు (అవనిగడ్డ): కోడూరు మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు అన్నం ప్రభాకర్‌రావు తల్లి అన్నపూర్ణ బుధవారం మృతిచెందగా ఆమె నేత్రాలను దానం చేసేందుకు కుమారులు ప్రభాకర్‌రావు, కిషోర్, సాంబశివరావు, నారాయణ, శివరామకృష్ణ ముందుకొచ్చారు. విజయవాడకు చెందిన ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలకు సమాచారం ఇవ్వగా వైద్యులు వచ్చి ఆమె కార్నియాను తీసుకెళ్లారు.

కనుల పండువగా బతుకమ్మ వేడుకలు



నాగాయలంక, న్యూస్‌టుడే: శ్రీరామపాద క్షేత్రం కమిటీ సభ్యులు దసరా సందర్భంగా గురువారం నాగాయలంక కృష్ణాతీరాన పుష్కర ఘాట్ వద్ద బతుకమ్మ పండగ కనులపండువగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, చిన్నారులు బతుకమ్మలను ఒక చోట చేర్చి పాటలు పాడి సంబరాలు చేసుకున్నారు. అనంతరం కృష్ణమ్మ ఒడిలోకి సాగనంపారు. కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటు



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాము, రావి

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రముఖ పారిశ్రామికవేత్త, సేవా తత్పరుడు పద్మ విభూషణ్ రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో టాటా చిత్రపటానికి గురువారం నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, తెదేపా నాయకులు చేవూరు జగన్‌మోహన్‌రావు, చాట్రగడ్డ రవి తదితరులు పాల్గొన్నారు.

* భాజపా పట్టణ అధ్యక్షుడు యర్రపోతు అర్జున్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు రతన టాటా మృతికి నివాళి అర్పించారు.

నాగాయలంక, న్యూస్‌టుడే: రతన్ టాటా లేనిలోటు తీరనిదని రాష్ట్ర సంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు అన్నారు. గురువారం స్థానిక మత్స్యకార భవనం వద్ద టాటా మృతికి సంతాపాన్ని వ్యక్తం చేశారు. కర్రి కృష్ణమూర్తి, లంకే శ్రీనివాసప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను ఆదుకోవడమే ప్రభుత్వం లక్ష్యం

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పేర్కొన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తెదేపా ఆధ్వర్యంలో రూ.70 వేల విలువ గల 18 ట్యూబ్‌లను బోటు యజమానులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కుమార్‌రాజా మాట్లాడుతూ ఖజానా ఖాళీ అయినప్పటికీ వరద బాధితులకు 20 రోజుల్లోనే నష్ట పరిహారం అందజేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదని తెలిపారు. త్వరలోనే నష్టపరిహారం అందని 151 మంది రైతులకు రెండో విడతగా రూ.22.49 లక్షలు వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. వరద సహాయ చర్యల్లో పాల్గొని బోట్లు నడిపిన 18 మందికి ఒక్కొక్కరికి రూ.25 వేలు చొప్పున ప్రభుత్వం వారి ఖాతాల్లో డబ్బులు వేసిందన్నారు. తెదేపా మండల అధ్యక్షుడు వీరపనేని శివరామప్రసాద్, నాయకులు గురుమూర్తి, మూడే శివశంకర్, పాముల శ్రీనివాసరావు, జనసేన నాయకుడు టి.సురేష్, తహసీల్దార్ ఎం.కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

త్వరలో నీటి సంఘాలకు ఎన్నికలు

ఘంటసాల, న్యూస్‌టుడే: ప్రభుత్వం త్వరలో నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనుందని తహసీల్దారు విజయప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మండల వీఆర్వోలకు నీటి సంఘాల సెగ్మెంట్లలో అనుసరించాల్సిన విధులను గురించి అవగాహన కల్పించారు. తహసీల్దారు మాట్లాడుతూ.. 151వ సెగ్మెంట్లో కొడాలి, తెలుగురావుపాలెం, 156వ సెగ్మెంట్లో పెదముత్తేవి, వి.రుద్రవరం, చిలకలపూడి, ఘంటసాల ఉన్నాయన్నారు. 159వ సెగ్మెంట్‌లో లంకపల్లి, దాలిపర్రు, పూషడం, ఎండకుదురు, 167 సెగ్మెంట్‌లో ఎండకుదరు, చిట్టూరు, 168వ సెగ్మెంట్‌లో మల్లవోలు, ఎండకుదురు, శ్రీకాకుళం, 188వ సెగ్మెంట్‌లో ఘంటసాల, శ్రీకాకుళం, తెలుగురావుపాలెం, చినకళ్లేపల్లి, కొడాలి, తాడేపల్లి, కొత్తపల్లి, ఘంటసాలపాలెం, దేవరకోట, పాపవినాశనం ఉన్నాయన్నారు. 189వ సెగ్మెంట్‌లో శ్రీకాకుళం, తెలుగురావుపాలెం, చినకళ్లేపల్లి, 190వసెగ్మెంట్‌లో చిట్టూర్పు, చినకళ్లేపల్లి, వేములపల్లి, చిట్టూరు, దేవరకోట గ్రామాలు ఉన్నాయన్నాని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు కనకదుర్గ, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

'ఆ జాబితా నుంచి మా పొలాలు తప్పించండి'



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న బాధితుడు శ్రీనివాసరావు

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: మధ్య తరగతి వర్గాల(ఎంఐజీ) ఇళ్ల నిర్మాణం కోసం పరిశీలించిన గుడివాడ మండలంలోని వలివర్తిపాడు, దొండపాడు గ్రామాల పరిధిలో సుమారు 430 ఎకరాలను రికార్డుల్లో ప్రభుత్వ స్థలాల కింద చూపారని.. తక్షణం వాటిని ఆ జాబితా నుంచి తప్పించాలని బాధితులు గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రమణ్యంను గురువారం కోరారు. గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని గతంలో ఎంఐజీ ఇళ్ల కోసం సుమారు 430 ఎకరాలు సేకరించాలని నిర్ణయించగా తాము ఆ పొలాలు అమ్మేది లేదని రైతులు కోర్టును ఆశ్రయించారు. దీంతో అప్పటి ఎమ్మెల్యే నాని అధికారులతో మాట్లాడి ఆ పొలాలు క్రయవిక్రయాలకు నోచుకోకుండా ప్రభుత్వ భూముల జాబితాలో చేర్పించారు. ఇదిలా ఉండగా గుడివాడలో ఎంఐజీ ఇళ్లకు గిరాకీ లేనందున ఆ పథకం అవసరం లేదని నాటి మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. దీంతో ఆ పథకం ఆగిపోయింది. అయినప్పటికీ పొలాలు మాత్రం తమ అవసరాల కోసం విక్రయించేందుకు వెళ్లగా కుదరదని రిజిస్ట్రార్ కార్యాలయం వారు పంపేస్తున్నారని బాధిత రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో నల్లూరి శ్రీనివాసరావు, ధనలక్ష్మి దంపతులు తమ కుమార్తె కోనాల చూచితకు పసుపు కుంకుమ కింద ఇవ్వాల్సిన పొలాన్ని రిజిస్టర్ చేయించడానికి వెళితే తిరిగి పంపారని.. తమ పిత్రార్జితమైన ఈ ఆస్తులపై ఆంక్షలు ఏమిటని ప్రశ్నిస్తూ తక్షణం న్యాయం చేయాలని శ్రీనివాసరావు ఆర్డీవో బాలసుబ్రమణ్యంకు వినతిపత్రం సమర్పించారు. దీనిపై ఆయన మాట్లాడుతూ కలెక్టర్‌కు సమాచారం ఇచ్చి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

విద్యుత్తు చౌర్యం సామాజిక నేరం



మాట్లాడుతున్న కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాస్

పామర్రు గ్రామీణం, పామర్రు, న్యూస్‌టుడే: విద్యుత్తు చౌర్యం సామాజిక నేరమని ఆ శాఖ మచిలీపట్నం కార్యనిర్వాహక ఇంజినీర్ జి.బి.శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్తు విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి గృహాలు, వాణిజ్య సముదాయాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిఘా విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ సీహెచ్.వాసు ఆధ్వర్యంలో 41 బృందాలుగా ఏర్పడి 2,796 గృహ, 63 వాణిజ్య సముదాయాల సర్వీసుల్ని తనిఖీ చేశారన్నారు. 137 సర్వీసులు అదనపు లోడు ఉన్నట్లు గుర్తించి సంబంధిత వినియోగదారులకు రూ.3.86 లక్షలు జరిమానా విధించామని తెలిపారు. ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ కె.సుందరరావు, సహాయ ఇంజనీర్ కె.మోహనకృష్ణ, పామర్రు, మచిలీపట్నం డివిజన్ పరిధిలోని ఏడీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలదే: ఆర్డీవో

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత పిల్లలదేనని గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయానికి వచ్చిన వృద్ధుల ఫిర్యాదులను గురువారం స్వీకరించి వారి పిల్లలకు నోటీసులు పంపారు. పట్టణంలోని ముబారక్ సెంటర్‌లో నివాసం ఉండే జె.కృష్ణమూర్తి(82)ను అతని కుమారుడు ఆస్తి మొత్తం తీసుకొని పోషించకుండా ఇంటి నుంచి పొమ్మంటున్నారని ఫిర్యాదు చేశాడు. దీంతో అతని కుమారుడు శ్రీనివాసరావుకు నోటీసు పంపాలని ఆర్డీవో సిబ్బందికి ఆదేశించారు. రైలు పేటకు చెందిన ఎం.కనకదుర్గమ్మ (62) తనకు సంతానం లేక తనకున్నదంతా సోదరి కుమార్తెకు ఇస్తే తీరా ఆమె సరిగా చూడడం లేదని ఫిర్యాదు చేయగా ఆమెకు కూడా నోటీసు పంపారు.


యంత్రంలో పడి ఉద్యోగి మృతి

తాడేపల్లి, న్యూస్‌టుడే : మంగళగిరి మండలం పెదవడ్లపూడిలో ఫుడ్ నాణ్యతను పరిశీలించే ఉద్యోగిని సుప్రియ(20) యంత్రంలో పడి గురువారం మృతి చెందినట్లు గ్రామీణ పోలీసులు తెలిపారు. గ్రామంలో ఓ ప్రైవేటు సంస్థ ఫుడ్ తయారు చేసే సంస్థను ఏర్పాటు చేశారు. అందులో కృష్ణాజిల్లా నందివాడ మండలం పుట్టగుంట గ్రామానికి చెందిన సుప్రియ నాణ్యతను పరిశీలించే ఉద్యోగం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రోస్టర్ మిషన్ ఆగిపోగా ఆమె అందులో చేయి పెట్టి పరిశీలిస్తుండగా ఒక్కసారిగా యంత్రంలోకి లాగివేయడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తండ్రి రమేష్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు చెప్పారు.



కృష్ణమ్మకు హారతి





నగరోత్సవంలో..





మదినిండా అమ్మ తలంపే..

శక్తి స్వరూపం.. భక్త నీరాజనం..

రేపటితో దసరా ఉత్సవాల ముగింపు

ఈనాడు, డిజిటల్ – అమరావతి, న్యూస్‌టుడే – ఇంద్రకీలాద్రి, చిట్టినగర్, భవానీపురం, కృష్ణలంక

విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం అమ్మవారు శ్రీ దుర్గా దేవి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. వేలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ఉత్సవాలు రేపటితో ముగియనున్నాయి. శుక్రవారం మహిషాసురమర్దిని దేవిగా, శనివారం పండగ రోజు శ్రీరాజరాజేశ్వరిదేవి రూపంలో దుర్గమ్మ భక్తులకు దర్శనమిస్తుంది. దసరా రోజు సాయంత్రం ప్రకాశం బ్యారేజీకి ఎగువన దుర్గాఘాట్‌లో తెప్పోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు హంస వాహనాన్ని ఇప్పటికే సిద్ధం చేశారు. ఆలయ అధికారులు, వేదపండింతులు కలిసి మంగళ వాయిద్యాలు, కోలాటం మధ్య దుర్గామల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా దుర్గాఘాట్ వద్దకు తీసుకొచ్చి.. హంస వాహనంపై ఉంచి పూజలు నిర్వహించాక నదీ విహారానికి తీసుకెళ్తారు.









తల్లీ శరణు

భవానీ భక్తుల రాక ఆరంభం...

దుర్గగుడికి భవానీ భక్తుల రాక ఆరంభమైంది. దసరా ఉత్సవాల చివరి మూడు రోజుల్లో కొందరు భవానీ భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకుంటారు. దసరా మరుసటి రోజు నుంచి రెండు రోజులు... వేల మంది భవానీలు దుర్గమ్మ దర్శనానికి వస్తారు. భవానీ భక్తుల కోసం దుర్గమ్మను శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకారంలోనే రెండు రోజులు ఉంచుతారు. అమ్మవారిని దర్శించుకున్న తర్వాత కొండ దిగువన కనకదుర్గానగర్‌లో భవానీలు మాల విరమణ చేస్తారు. గత ఏడాది విరమణకు సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో.. భవానీలు తీవ్ర అసంతృప్తితో వెళ్లారు. వాళ్లు ఇరుముడిగా తీసుకొచ్చిన బియ్యం, కొబ్బరికాయలను సైతం కనకదుర్గానగర్‌లో రహదారుల పక్కన పడేశారు. ఈసారి అలా జరగకుండా ఏర్పాట్లు చేయాలని భవానీలు విజ్ఞప్తి చేస్తున్నారు.





కళా వేదికపై ఆకట్టుకున్న ప్రదర్శన





జయహో దుర్గా భవానీ

నృత్య విన్యాసం

నేటి అలంకారం

శ్రీ మహిషాసురమర్దినీ దేవి



మహిష మస్తక నృత్తవినోదిని
స్ఫుటరణన్మణినూపుర మేఖలా
జనన రక్షణ మోక్షవిధాయిని
జయతి శుంభ నిశుంభ నిషూదిని॥

లోకకంటకుడైన మహిషాసురుడిని చంపిన మహోగ్ర రూపం ఇది. సకలదేవీ, దేవతల శక్తులన్నీ ఈ దేవీలో మూర్తీభవించి ఉంటాయి. మానవనేత్రంతో చూడ సాధ్యం కాని దివ్యతేజస్సుతో, అనేక ఆయుధాలతో సింహవాహినియై ఈ తల్లి భక్తులకు దర్శన భాగ్యం కలిగిస్తుంది. ఈ తల్లి అనుగ్రహం పొందితే అసాధ్యమనేది ఉండదు. మహిషాసుర సంహారం జరిగిన రోజునే 'మహర్నవమి'గా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ రోజున చండీ సప్తశతీహోమం చేసిన వారికి శత్రుభయం ఉండదు. అన్నింటా విజయం కలుగుతుంది. ఓం ఐం హ్రీం శ్రీం సర్వసమ్మోహిన్యై స్వాహా అనే మంత్రాన్ని జపించి, పానకం, వడపప్పు, గారెలు, పులిహోర, పాయసాన్నం నివేదన చేయాలి. సువాసినీ పూజ చేసి, మంగళద్రవ్యాలు, శక్తికొద్దీ నూతన వస్త్రాలు పెట్టాలి.



కుంకుమార్చనలో..



కన్నయ్య లీలా వినోదం



క్యూలైన్లలో భక్తులు



కళాభినయం

కృష్ణమ్మ మదిలో.. సేవారతన్


- ఆదర్శ పల్లెలకు 'టాటా' బాటలు
- 264 గ్రామాలకు ట్రస్టు సేవలు
- ఎన్టీఆర్ జిల్లాలో రూ.కోట్లు వెచ్చింపు
- 2019 తర్వాత అందని ప్రభుత్వ చొరవ

ఈనాడు, అమరావతి

అది 2015.. విజయవాడ పార్లమెంటు పరిధిలో గంపలగూడెం మండలం నెమలిలో ఊరంతా జ్వరాల బారిన పడింది. రాష్ట్రంలో నాడు డెంగీ జ్వరాలు ఎక్కువగా వ్యాపించాయి. గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. కానీ వారికి ఉచిత, మెరుగైన చికిత్స కావాలంటే ఎలా? నాడు పారిశ్రామిక దిగ్గజం.. టాటా సంస్థ సేవా కార్యక్రమాల్లో భాగంగా రూపొందించిందే.. కుటుంబ ఆరోగ్య కార్డు. విజయవాడ ఎంపీ పరిధిలో 264 గ్రామాల్లో 2.50 లక్షల కుటుంబాలకు ఈ కార్డులు అందించారు. ఒక్క కార్డు ఆధ్వర్యంలో కుటుంబంలో సభ్యులు అందరికీ ఏడాదిలో రూ.లక్ష విలువైన వైద్యం కార్పొరేట్ ఆసుపత్రుల్లో అందించారు. 2015 నుంచి నాలుగేళ్ల ఈ సేవలు కొనసాగాయి. కొన్ని వేల కుటుంబాలు లబ్ధి పొందాయి.

తిరువూరు పరిధిలో కోడూరు గ్రామ యువతి స్పందన.. కుట్టుమిషన్‌తో దుస్తులు కుట్టేది. టాటాట్రస్టు సేవల్లో భాగంగా ఇంటర్నెట్ సాథీ కార్యక్రమంలో భాగస్వామి అయ్యారు. టాటా ట్రస్టు వాలంటీర్లు ఆమెకు ఇంటర్నెట్ వినియోగంపై శిక్షణ ఇచ్చారు. నైపుణ్యాలు పెంచేలా అవగాహన కల్పించారు. తర్వాత ఆమె ఇంటర్నెట్ ఆధారంగా సరికొత్త డిజైన్లు రూపొందించి కుట్టేవారు. తద్వారా ఆదాయం పెరిగింది. ఇలా ఆమె ఒక్కరే కాదు.. వేల మందికి ఇంటర్నెట్ సాథీ ఉపకరించింది.

ఇవేకాదు.. విద్య, వైద్యం, ఉపాధి, గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా టాటా ట్రస్టు సేవలు మరువలేనివి. విజయవాడ పార్లమెంటులో 264 గ్రామాలను స్మార్టు విలేజ్‌లుగా రూపొందించేలా ట్రస్టు సేవలు ప్రారంభించి నాలుగేళ్ల కొనసాగించింది. ఇందుకు వివిధ సేవా కార్యక్రమాలకు సుమారు రూ.3 వేల కోట్లు వెచ్చించినట్లు సమాచారం. ప్రధాని మోదీ సంసాద్ ఆదర్శ గ్రామ యోజన ఆలోచనలో భాగంగా గ్రామీణాభివృద్ధికి టాటా ట్రస్టు విజయవాడ పార్లమెంటును ఎంపిక చేసుకుని నాటి ఎంపీ కేశినేని నాని చొరవతో ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. 2019 తర్వాత ఎంపీగా నాని ఎన్నికైనా.. ప్రభుత్వం మారడంతో సేవా కార్యక్రమాలు దాదాపు నిలిచిపోయాయి.





2011లో విజయవాడలో టాటా వినియోగదారులు, డీలర్లతో కరచాలనం



విజయవాడలో ఆర్చరీ క్రీడాకారిణి జ్యోతిసురేఖకు అభినందన. పక్కన నాటి సీఎం చంద్రబాబు, పూర్వ ఎంపీ కేశినేని నాని

టాటా ట్రస్టు.. ముందడుగు..!

టాటా ట్రస్టుకు కేశినేని నానికి విడదీయరాని అనుబంధం ఉంది. ట్రస్టు ఛైర్మన్‌గా ఉన్న పారిశ్రామిక దిగ్గజం.. దేశంలో ఎంపీలు అందరికీ ఒక గ్రామాన్ని దత్తత తీసుకోవాలని 2014లో లేఖలు రాశారు. దానికి అవసరమైన నిధులు ట్రస్టు సమకూరుస్తుందని హామీ ఇచ్చారు. అలా విజయవాడ ఎంపీ స్పందించి ఒక గ్రామం పేరు సూచించి ప్రణాళికలు పంపారు. నాడు ప్రధాని సంసాద్ ఆదర్శ గ్రామ యోజన ప్రారంభమైంది. దీనికి అనుబంధంగా విజయవాడ పార్లమెంటు పరిధిలో అయిదు గ్రామాలను టాటా ట్రస్టు ఎంపిక చేయాలని భావించి క్రమేపీ 264 గ్రామాలను దత్తత తీసుకుని ఆదర్శ గ్రామాలుగా రూపొందించేలా ప్రణాళికలు రూపొందించారు. దీనిపై 2015 ఆగస్టు 24న విజయవాడలో భారీగా చేపట్టిన దత్తత స్వీకార కార్యక్రమానికి ఛైర్మన్ రతన్‌టాటా హాజరయ్యారు. సీఎం చంద్రబాబు హాజరై ఒప్పందం చేసుకున్నారు. అదే రోజు గేట్‌వే హోటల్‌లోనూ పారిశ్రామిక సదస్సులో రతన్ టాటా పాల్గొన్నారు.



టాటా ట్రస్ట్ అందజేసిన రిక్షా ద్వారా చెత్త సేకరణ



టాటాట్రస్టు తోడ్పాటుతో నిర్మించిన మరుగుదొడ్డి

ట్రాఫిక్‌లో చిక్కుకున్న టాటా...

బెజవాడతో టాటా అనుబంధం ఎక్కువే. మధ్య తరగతి కుటుంబానికి రూ.లక్ష కారు... నానోను ఆవిష్కరించాక ఆయన 2011 ఆగస్టు 20న విజయవాడ వచ్చారు. టాటా షోరూంలో.. 100 నానో కార్లు అందించే కార్యక్రమానికి హాజరైన ఆయన గన్నవరంలో విమానం దిగి రామవరప్పాడు షోరూమ్‌కు వస్తుండగా లారీ డ్రైవర్ల సమ్మెతో ఇరుక్కుపోయారు. కారు దిగిన ఆయనను లారీ ఓనర్స్ గమనించి ఆయన కారును మాత్రం తప్పించి సమావేశానికి పంపారు. తర్వాత 2015లో గ్రామాల దత్తతకు హాజరయ్యారు. అప్పుడే పారిశ్రామిక సదస్సులో పాల్గొన్నారు. నాటి ఎంపీ నాని కూతురు వివాహానికి (హైదరాబాద్‌లో) హాజరై ఆశీర్వదించారు. రతన్‌తో నానికి అనుబంధం ఉంది. విజయవాడలో ఏర్పాటు చేయాల్సిన క్యాన్సర్ ఆసుపత్రిని నాటి సీఎం చంద్రబాబు సూచన మేరకు తిరుపతికి మార్చారు.



2011లో నానో కారు కొనుగోలుదారుకు తాళం చెవి అందిస్తూ..

ప్రణాళికలతో ప్రారంభం..!

మొదట అర్బన్ నియోజకవర్గాలు మినహా నాలుగు సెగ్మెంట్లలో 264 గ్రామాల్లో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించారు. టాటా ట్రస్టు ఆధ్వర్యంలో 1,200 మంది వాలంటీర్లను నియమించారు. మూడు నెలలు అన్ని గ్రామాల్లో ఇంటింటికి తిరిగి వారికి ఏం కావాలో 150 ప్రశ్నలతో ఒక ప్రణాళిక రూపొందించారు. వీటిని క్రోడీకరించి గ్రామాల్లో అభివృద్ధికి ముందు విద్య, వైద్యం, ఉపాధి అంశాలను ఎంపిక చేశారు. ఆ కార్యక్రమాలు నిర్వహించారు. దీనికి ఒక వ్యవస్థను పెట్టి... విజయవాడలో ట్రస్టు కార్యాలయం ఏర్పాటు చేశారు. రాష్ట్ర కోఆర్డినేటర్‌గా రాజేందర్‌ను నియమించారు. ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

వైద్యం... ప్రాధాన్యం..!

ప్రధాని పిలుపు మేరకు నాటి ఎంపీ నాని గొల్లమందలను ఎంపిక చేసుకుని ఆదర్శ గ్రామంగా పలు అభివృద్ధి పనులు నిర్వహించారు. అదే తరహాలో 264 గ్రామాల ప్రణాళిక తయారైంది. ఈ గ్రామాల్లో టాటా ట్రస్టు ద్వారా ఎక్కువగా వైద్య సేవలు అందించారు. ఆరోగ్య కార్డు 2.50 లక్షల కుటుంబాలకు అందించారు. కొన్ని వందల వైద్య శిబిరాలు నిర్వహించారు. 16 మండలాల్లో 22 టెలీ మెడిసిన్ సెంటర్‌లు ఏర్పాటు చేసి స్పెషలిస్టులతో చికిత్స అందించేవారు. 120 మంది వైద్యులను నియమించి రెండు బస్సులు పెట్టి శిబిరాలు నిర్వహించేవారు. తద్వారా 1.40 లక్షల మందికి వివిధ రకాల చికిత్సలు, మందులు అందించారు. టెలిమెడిసిన్ కేంద్రాల ద్వారా దాదాపు లక్ష మందికిపైగా చికిత్స పొందారు. ఒక్క టెలీ మెడిసిన్ కేంద్రానికి రూ.60 లక్షల వరకు ఖర్చు చేశారు. బీమా కార్డుల ద్వారా 16 వేల మందికి ఉచిత ప్రసవాలు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చేశారు. ఎ.కొండూరు మండలంలో వైద్యశిబిరాల ద్వారా అక్కడ కిడ్నీ వ్యాధుల తీవ్రత వెలుగు చూసింది. ఇబ్రహీంపట్నంలో రూ.50 లక్షలతో సెంట్రల్ ల్యాబ్ ఏర్పాటుకు ప్రతిపాదించారు.



జి. కొండూరులో టాటా టెలీ మెడిసిన్ సెంటర్



పెనుగంచిప్రోలు మండలంలో టాటా ట్రస్టు నిర్మించిన తాగునీటి ట్యాంకును ప్రారంభిస్తున్న నెట్టెం రఘురాం, శ్రీరాం తాతయ్య

మగువలకు బలం.. పల్లెకు జలం..

ఇంటర్నెట్‌సాథీ పేరుతో వేల మందికి అంతర్జాల వినియోగం, నైపుణ్యాల మెరుగుకు తర్ఫీదు ఇచ్చారు. స్వయం ఉపాధిని పెంచారు. వీరిలో మహిళలే ఎక్కువ. అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునికీకరించి.. పిల్లలకు పౌష్టికాహారం అందించారు. గత ప్రభుత్వ నాడు నేడు తరహా పనులు బడుల్లో టాటా ట్రస్టు చేపట్టింది. కొన్ని మండలాల్లో పార్కులు అభివృద్ధి చేశారు. దాదాపు 400 వరకు మంచినీటి ట్యాంకులు నిర్మించారు. చెత్త రిక్షాలు, బుట్టలు పంపిణీ చేశారు. కొందరు రైతులకు సూక్ష్మ సేద్య పరికరాలు అందించారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చారు. 2019 తర్వాత సేవలు నిలిచిపోయాయి.

నా బిడ్డను బతికించింది



2016లో తొమ్మిదేళ్ల వయసున్న నా కుమారుడు వెంకట సూర్య ధనుష్ అకస్మాత్తుగా అనారోగ్యానికి గురయ్యాడు. రక్త సంబంధిత వ్యాధికి గురవడంతో విజయవాడ కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించాల్సి వచ్చింది. వైద్యానికి రూ.లక్ష వరకు అవుతుందని చెప్పారు. నా కుటుంబానికి స్థోమత లేదు. నాటి ఎంపీ నానిని ఆశ్రయించగా టాటా ట్రస్ట్ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రిలో నా బిడ్డకు రూ.లక్ష విలువైన వైద్యం చేయించారు. నా బిడ్డ ఆరోగ్యంగా ఉండటానికి కారణమైన రతన్ టాటా రుణం తీర్చుకోలేనిది. – మలిశెట్టి రాంబాబు, మేడూరు, గంపలగూడెం

జ్వరం నుంచి కోలుకున్నాను



తీవ్ర జ్వరంతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రిలో చేరాను. రూ.60 వేల వరకు ఖర్చవగా, ఆ మొత్తం టాటా ట్రస్ట్ కార్డు ద్వారానే ఆస్పత్రికి చెల్లించారు. నాలాంటి లక్షల మందికి టాటా ట్రస్ట్ ప్రాణదానం చేసింది.

– మల్లవల్లి పవన్, పొందుగల, మైలవరం మండలం

మా పాప ప్రాణం నిలబడింది

మా పాప రహానా 2019లో డెంగీ బారిన పడింది. తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న తరుణంలో టాటా ట్రస్ట్ హెల్త్ కార్డుతో గొల్లపూడిలోని ఆంధ్రా హాస్పిటల్‌లో చేర్పించగా, ఖరీదైన వైద్యం అందింది. సుమారు రూ.70 వేలకు పైగా ఖర్చవగా.. వారే చెల్లించారు.

– షేక్ జబ్బార్, మైలవరం

కాన్పులకు ఆర్థిక చేయూత



2016, 2017లో నా భార్య రాజకుమారికి ఓ ప్రయివేటు ఆస్పత్రిలో సిజేరియన్ ద్వారా ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. ఇందుకు రూ.80 వేలు ఖర్చయింది. నాటి ఎంపీ నానిని కలిసి సిజేరియన్ కాన్పునకు సాయం చేయాలని వినతి ఇచ్చాను. ఆయన వెంటనే టాటా ట్రస్ట్ ద్వారా ఆ మొత్తం ప్రయివేటు ఆస్పత్రి వైద్యులకు చెల్లించే ఏర్పాటు చేశారు. రతన్ టాటా మా కుటుంబానికి అందించిన సాయం మరిచిపోలేను. - గద్దల రవిచంద్ర, గంపలగూడెం